# బామ్మ

రోజూ రోజూ పెరిగిపోతున్న యీ భారం భరించడం కష్టంగావుంది బ్రదర్, నీసలహా ఏమిటని మాదేవి అడిగినట్లు, నేను - లారీ డ్రైవరుగానో, డాక్టరుగానో తయారయి - నాచేతనైన సహాయం - వీలున్నంతలో చేస్తానని ప్రామిస్ చేస్తున్న తరుణంలో, చేతికేదో తగిలేసరికి మెలకువ వచ్చి చూశా - "ఎంత ఆదివారమైతే మట్టుకు అంతసేపానిద్ర. అదీగాక యింతమంది చుట్టాలున్న యీ టైములో మీరిలా నిద్రపోతున్నారంటే - మీది ఎంత కఠిన హృదయమండీ" అన్నది - ఎవరోగాదు- మాహోండిపార్టుమెంటువారు. "నీ పన్న పదంలో కఠినత్వముందిగాని, కాగడాపెట్టి వెదకినా, - నాహృదయంలో- మచ్చుకైనా - కఠినత్వంలేదన్నాను."

'ముందు కాఫీ త్రాగండి చల్లారుతోంది. తర్వాత కోద్దురుగాని.' అని గ్లాసు అందించి లోపలికి వెళ్ళింది.

కఠినత్వమనే మాట నాలుగయిదుసార్లు నన్ను మాఆవిడ అంటూ వచ్చిందంటే - ఎందుకంటోందో - అది మా యిద్దరికితప్ప యితరులకు తెలియదు కాని, నాఅంతర్యం యింతవరకు ఆవిడకు తెలియనియ్యక పోవడమే ఆవిడ నన్ను అలా అనడానికి కారణం. నన్ను అంటున్న మనిషి మా ఆవిడేకాబట్టిన్నీ, మనుష్యుల్ని సస్పెన్సులో పెట్టడమే నాహాబీ గాబట్టిన్నీ, నేను, మరో విధంగా ఆవిడను అర్థంచేసుకోవలసిన అవసరం లేకపోయింది.

అసలు మా బామ్మే నేను చాలా మంచి వాడని సర్టిఫై చేసినపుడు - ఎక్కడినుంచో వచ్చిన మా ఆవిడ - నన్ను అన్నదంటే - అందులో విలువేముంది? అసలు మా బామ్మ నా ఒంటిమీద యీగకూడా వాల్నిచ్చేది గాదు. మా బామ్మ చేసిన ఆ సహాయంవల్ల మా అమ్మన్నా, నాన్నన్నాకూడా నాకు భయం లేకుండా పోయిందని నేనే ఒప్పుకుంటున్నాను. కాని, నిష్పాక్షికంగా చెప్పాలంటే, మానాన్నంటే ఒకప్పుడు గాకపోతే ఒకప్పుడైనా కొంచెము భయముండేది గాని అమ్మంటే మాత్రం నిర్లక్ష్యంగా వుండేవాణ్ణి.

"మీరిలాటివాణ్ణి నెత్తినెక్కించుకుంటే వాడెందుకైనా పనికివస్తాడా. చివరకు వెధవై కూర్చుంటాడు" అని ఒకరోజున మాబామ్మతో అంది మాఅమ్మ. నన్ను 'వెధవ' అని మా అమ్మ సంబోధించినందుకు మాబామ్మ ఎంతోబాధపడి కళ్ల నీళ్ళు పెట్టుకుని, యీరోజు మొదలుకొని యీలాటిఅపశబ్దాలుపలికావంటే మేమిద్దరం యింట్లోంచి వెళ్ళిపోతాం" అన్నది బామ్మ.


రచన:

శ్రీ డి. టి. అనంతాచార్యులు


"పిల్లని చంకపెట్టుకున్నట్లు ఆవెధవ కూడా ఎందుకు" అంది మా అమ్మ.

'అకూతే కూయోద్దన్నా' అంది బామ్మ.

'అయితే వాణ్ణనే అధికారం కూడా నాకు లేకుండాపోయిందన్నమాట. యింతకు మిమ్మల్నడవలసిన పనేముంది. యిదంతా ఆయనగార్ని అనాలి. ఆయన అలుసు యివ్వబట్టే యిలాజరుగుతోంది. నిజానికి ఆ చట్రమే అంతయితే ఆయన్ని అని మట్టుకు లాభమేమిటి!' అని అమ్మ అంటూండగా మానాన్నగారు రావడం చూచి, మాబామ్మ అందుకుంది.

"ఓరేయ్. యిది పేట్రేగిపోతోంది రోయ్, అసలు మన వంశానికే పెట్టేశింది. ఏదో మీనాన్న, దీని తండ్రి స్నేహితులని, వీళ్ళు కట్నము ఏడవలేనివాళ్ళని తెలిసి కూడా, ఏదో మనవాడికే ముద్దేద్దామని మీనాన్నంతే - సరేలే అని ఒప్పుకున్నాను మొదట యివన్నీ తెలుసాయ్రా" అంది బామ్మ అమ్మకేసిచూస్తూ. మా అమ్మ మొహము కందగడ్డలా ఎరుపెక్కింది. నిజానికి ఆరోజున మానాన్నగారే రాకపోతే, కొంప లంటుకునేవనటంలో సందేహములేదు. మా నాన్నగారు ప్రథమ చికిత్సలోపడి 'యిదంతా యీ వంశోద్ధారకుణ్ణి గురించి వచ్చిన తగాదాయేనా' అన్నారు.

"ఒరేయ్ నీవు ఏ ఉద్దేశంతో ఆ మాటన్నావరే' నీకొడుకు గొప్పవాడౌతాడన్న విషయం పేరుబట్టే తెలుస్తోంది" అన్నది మా బామ్మ సంతోషంతో.

కాని, చేతులు వెనక్కి బెట్టుకుని మా అమ్మ మెటికెలు విరవడం వెంటనే నేను కనిపెట్టి మా బామ్మ ఒళ్లో అడ్డంగా కూర్చున్నా ఘనకార్యంచేసినట్లు, కాని, మా బామ్మ అంతకు ముందే గ్రహించి,

"యింతకన్నా నీవేమీచేయలేవు. ఒరేయ్ చూశావురా" అంది లోపలికి చరచరా వెళుతున్న మా నాన్ననిచూస్తూ.

"ఒసేయ్ లోపలికిరా, అని మా అమ్మను పిలుస్తున్న మానాన్నకు మాబామ్మ పిలుపు వినపడ్డోలేదో, లేక రభసలేకుండా చేయాలని రాలేదోకాని, అనాడు వాతావరణం ప్రశాంతంగా వెళ్ళిపోయింది.

'ఆడపిల్లలజోలి మీవాడికెందుకండీ! యిలాగయితే మీవాడికి ప్రాయశ్చిత్తం జరుగుతుంది' అంటూ రజని తన ఎనిమిదేళ్ళ చెల్లెల్ని వెంటబెట్టుకునివచ్చి బామ్మతో అన్నాడు.

'ముందు నీకు ప్రాయిశ్చిత్తమైందా, అని అన్నది బామ్మ.

రజని తెల్లబోతూ, 'అదేమిటండి పెద్దవారుమీరుకూడా అలాఅంటారు' అన్నాడు.

'విషయము చెప్పకుండా ముందుగానే మా వాడిమీదకు పోట్లాటకొస్తావా' అంది బామ్మ.

'అదిగాదండి, మొన్ననే మా చెల్లికి కొన్న కొత్త పుస్తకము మీవాడు తన సంచిలో దాచుకుని లేదు పొమ్మన్నాట్ట, మా అమ్మాయి ఆ పుస్తకము పోయి

నందుకు మేమేమన్నా అంటామేమో అని ఏడుస్తోంటే - నేను డబ్బిస్తా ఏడవకంటూ బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాట్ట. ఏమిటండి ఆపనులు అన్నాడు రజని.

"అబ్బాయి గుర్రాన్నికట్టు, నాన్నా నీ సంచి తీసుకురా" అని నాతో అంది బామ్మ. నేను సంచితెచ్చి బోర్లించేసరికి క్రిందబడ్డ ఆపిల్ల పుస్తకముచూచి నేను తెల్లమొహము వెయ్యాలసివచ్చింది. బిక్కమొహముతో నాకు తెలియదు బామ్మా అన్నాను.

"యిప్పుడేం జెపుతారండి అన్నాడు రజని.

"సరే బాగుంది. ఎవరో మీఅమ్మాయిని ఏడ్పించాలని మావాడిసంచిలో మావాడికి తెలియకుండా దాచివుంచారు. అశుభము శుభము తెలియని మావాణ్ణంటావా. అంది మా బామ్మ.

"ప్రత్యక్షంగా కళ్ళకు కనబడ్డదాన్ని గూర్చికూడా పెద్దవారు మీరుకూడా అలా అంటే - నేనేమనాలి. యిహ పోదాం రా అమ్మా. బళ్లో ఆ అబ్బాయి మొహంకేసి కూడాచూడకు" అనిఅంటూ వెళ్ళిపోయాడు రజని. రజని విన్నా వినకపోయినా మా బామ్మ మట్టుకు యీమాట అంది. "మా అబ్బాయి మట్టుకు తప్పకుండా మీఅమ్మాయి మొహము చూస్తాడు" అని. ఆవిడ అన్న మాట వేదవాక్కు అని తర్వాతగాని నేను తెలుసుకోలేక పోయాను.

ప్రతిక్లాసు తప్పకుండా పాసయి, పెరిగి పెద్దవాణ్ణవుతున్ననాకు 18 వ ఏటనే పెళ్ళి చేయాలన్న తలంపు కలిగింది. మాబామ్మకు. యింతచిన్న వయస్సులోనే పెళ్లిచేయట మేమిటీ కనీసము బి. ఏ. అన్నా పూర్తి చేయనీ అన్నారు మానాన్న.

"ఒరేయ్ అది మనమనస్సులో వుంది గాని, పెళ్లిచేసుకున్న తర్వాత చదువుకున్న వాళ్ళు లేరూ ? ఏదో నాఘటం వుండగానే వాళ్లముచ్చటా మురిపెం చూద్దామని ఉవ్విళ్ళూరుతున్నాను. ఘటం శాశ్వతం గాదుగదా, నువ్వు నామాట తీసేయ్యవనే వుద్దేశ్యంతో నీచెవినివేశా" అంది జాలిగా.

నా అంతట నేను పెళ్లిసెలెక్టు చేసుకొనే రోజులు కాకపోవటంచేత - పెళ్లిపీటల మీద ఆవిడను చూడటముతోటే తెల్లబోయా. వెంటనే పుస్తకాలసంచి జ్ఞాపకము వచ్చి 'నీకెన్ని వారపత్రికలు కావాలంటే అన్నికొనిపెడతా' అన్నా మెల్లిగా. సిగ్గుతో తలవంచుకుని కూర్చున్న ఆమె నామాటవిని నాకేసిచూచిన ఆచూపుకు నేను అయినయి మాబామ్మకేసిచూశా. ఆమె బోసినోటినవ్వు నన్ను పరవశుణ్ణి చేసింది.

మేముభయులము మా బామ్మ దీవెనల నందినుంచున్నప్పుడు మాబామ్మ నాచెవిలో 'చూశావా ఏంచేశారో' అంది ముక్తసరిగా. నాకేమీ అర్థంకాలేదు. కాగా. తిరిగి చల్లని చేయి నావేలిని స్పృశించేసరికి ఆమె ననుసరించా.

చివరకు మాబామ్మ విషయము మా అమ్మనడిగి తెల్సుకున్న తర్వాతఅది అష్టే బాధించని విషయమని తేలింది. ఎంత చిన్న విషయమైనా ఆమెలో ఆకించుత్తు సంకోచము ఎందుకు కలగాలిఅని అనిపించిందినాకు. ముద్దుగావున్న మాబామ్మ మనస్సులో కష్టము కలిగినందుకు నేను కొంచెము బాధపడ్డా. అదిగాక, కట్నము లేకుండా కేవలము లాంఛనాలతో-నావంటి యోగ్యుడు (పెళ్లికూతురు తరపున బంధువులు అనుకున్నటువంటిన్నీ, స్వయముగా నేను విన్నటివంటి విషయము) దొరికినప్పుడు, యీకాస్తలో కక్కుర్తి పడటము నిజంగా విచారించవలసిన విషయము. అందుచేత. యీవిషయములో మా అమ్మతో వాదిస్తున్న సమయములో, మాబామ్మవచ్చి 'పోనీలే నాయనా' నీవు వృద్ధిలోకివచ్చి వుద్యోగము చేసుకుంటుంటే అదేనాకు పదివేలు అంది. యింతలోనే మా నాన్నగారు వస్తూనే 'వాళ్ళిచ్చేదేమిటీ' యిదిగో అంటూ, మాబామ్మచేతికి పల్లుతాను అందిచ్చారు.

తుదిఘడియలు సమీపములోనున్న మాబామ్మ, మాయుభయులను తనమంచము దగ్గరకు రమ్మనమని నాతల నిమురుతున్న సమయములో, మాబామ్మనిచూస్తే నాకెంతో బాధనిపించింది. సమయము దొరికినప్పుడల్లా నాబాల్యము మొదలు జరిగినవన్ని నాకు చెపుతూంటే ఆమెతో నాకు సరదాగా కాలక్షేపం జరిగేది. ఆఫీసుకెళ్తానని ఆమెతో చెప్పి - ఆమె కళ్లనుండి జారుతున్న నీటి బిందువునుమాత్రమే అడ్డుకోగలిగాను.

అప్పుడే ఆఫీసునుంచి వస్తున్న నేను - యింట్లో గొల్లుమనటము వినపడి ఒక్క తృటిలో బామ్మ మంచము దగ్గరకొచ్చి చూచా. అందరు ఆవిడ ప్రక్కవున్నారు. మాఆవిడ మొఖము చూస్తుంటే అన్యాపదేశంగా 'మీరుకూడా ఏడవరేం' అన్నట్లు అనిపించింది. నాకు కళ్ళవెంటనీటిబిందువు కూడా రాలేదు. కాని, ఒక్కందుకు మాత్రము మనస్సులో బాధపడ్డాను. మా బామ్మ తాతయ్యల దాంపత్యము నేను చూసివుంటే బాగుండేదిగదా అని.

నిజంగా మాబామ్మవంటి యోగ్యురాలు యికదొరకదు తాతయ్యా, తాతయ్య పేరు నాకు పెట్టినందుకే నన్ను అంత యిదిగా చూచింది అంటే - నిజంగా - తాతయ్య ఏంతో అదృష్టవంతుడయియుండాలి అని అనిపించింది - అన్నాను 13 వ రోజున చూడడానికి వచ్చిన రామయ్య తాతతో.

"ఒరేయ్, నీకంతగోష విన్నాను. నేనొక్కమాటచెపుతాను. వింటావు" అన్నాడు రామయ్యతాత. తల వూపాను.

యోగ్యురాలని నీవు చెపుతున్న మీ బామ్మ - మీతాతయ్యను - రాశిరంపాన పెట్టినట్లుగా - ఎవర్నీ - ఏ స్త్రీ పెట్టివుండదని - నావూహ. మీతాతయ్య గోలపెట్టేవాడు - అన్నాడు రామయ్య తాత.

కేసు కొట్టేసి, ఖర్చులుకూడా నన్నే భరించమని, మారామయ్యతాత యిచ్చిన - జడ్జిమెంటువిన్న నేను. మళ్ళీ నోరు మెదపటానికి వీలులేకపోయింది.